TGTEL/25/A3750


... నిజమే ...

# నిజాయితి

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య  సంపుటి 1  సంచిక 18  ప్రింటర్ : గుండూర్ శ్యామ్ .  మంగళవారం 02 డిసెంబర్ 2025  వెల 4:00


"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.



# పాలమూరు పరుగులు





- నారాయణపేటలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన.
- అభివృద్ధి వేటలో వేగం పెంచిన ప్రభుత్వం -
- కీలక పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు

**నారాయణపేట/మక్తల్, డిసెంబర్ 1 (నిజాయితి) :** తెలంగాణ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా పాలమూరు అభివృద్ధిలో పరుగులు పెట్టించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లా మక్తల్ లో పర్యటించారు. భారీ ప్రజాసందడి మధ్య సీఎం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన

మక్తల్ మండలం గొల్లపల్లి శివారులో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్కు సీఎం శంకుస్థాపన చేశారు. నూతన తరానికి ఆధునిక విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాల ఏర్పాటు ముఖ్యమని సీఎం పేర్కొన్నారు.

### కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ప్రారంభ దశ

కాట్రేపల్లి వద్ద కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సీఎం భూమిపూజ చేశారు. పైలాన్‌ను ఆవిష్కరించి, ఈ పథకం ద్వారా సాగునీటి సదుపాయం విస్తృతంగా పెరుగుతుందని తెలిపారు.
"ఈ ప్రాంతంలోని రైతులకు నీటి కొరత సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు.

### బీటీ రోడ్డు పనులకు నాంది

మక్తల్ %-% నారాయణపేట రహదారి బీటీ రోడ్డు పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. రోడ్డువ్యవస్థ మెరుగుపడితే గ్రామాలు, పట్టణాల మధ్య రవాణా, వాణిజ్యం పెరిగి, ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరుతుందని సీఎం అన్నారు.

### ఆంజనేయస్వామి ఆలయ దర్శనం

పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి మక్తల్‌లోని పడమటి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ముఖ్యమంత్రిని స్వాగతించారు.

### గొల్లపల్లిలో భారీ బహిరంగ సభ

తరువాత గొల్లపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలు, గ్రామీణ ప్రాంతాల పురోగతి గురించి వివరించారు.
మండలి సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో సభకు హాజరయ్యారు.

### మంత్రుల సమక్షంలో సమగ్ర ఏర్పాట్లు

పర్యటనలో రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, దామోదర్ రాజనారాయణసింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.
మంత్రి వాకిటి శ్రీహరి, నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ వినీత్లతో కలిసి హెలిప్యాడ్, భద్రత, రూట్ మ్యాప్, పార్కింగ్, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాట్లను పరిశీలించారు.

### ప్రజల సందడి - భక్తుల హాజరు

వివిధ మండలాలు, జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, రైతులు, యువత సభకు చేరుకున్నారు. ఆలయ దర్శనానికి ప్రత్యేకంగా భక్తులు, స్థానికులు హాజరయ్యారు.
సమావేశ ప్రాంగణం పూర్తిగా కిటకిటలాడగా, ముఖ్యమంత్రి సందేశాలకు ప్రజలు చప్పట్లతో స్పందించారు.

## ఈ అద్భుత పాలసీని జాతికి అంకితం చేస్తున్నాం - సీఎం రేవంత్ రెడ్డి



**తెలంగాణ అభివృద్ధిపై విజన్ డాక్యుమెంట్ విడుదల చేసిన సీఎం**
**2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యమని వెల్లడి**
**ఆదాయం పెంచి పేదలకు పంచడమే తమ విధానమన్న సీఎం**

**హైదరాబాద్, డిసెంబర్ 01 (నిజాయితి):**
గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని తెలంగాణ భవిష్యత్తు కోసం పటిష్టమైన ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన 'విజన్ డాక్యుమెంట్ 2047' వివరాలను వెల్లడించారు. రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు ఈ విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేసినట్లు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి పారదర్శక విధానాలు అవసరమని, పాలసీలకు పెరాలసిస్ వస్తే పెట్టుబడులకు రక్షణ ఉండదని అన్నారు. ఐఎస్‌బీ, నీతి ఆయోగ్ వంటి సంస్థల సహకారంతో పాటు లక్షలాది మంది ప్రజల భాగస్వామ్యంతో ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నట్లు వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థకు తెలంగాణ 5 శాతం వాటాను అందిస్తోందని, దీనిని 10 శాతానికి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు సీఎం చెప్పారు. వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండంలో కొత్తగా నాలుగు విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్-మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి కేంద్రం నుంచి అంగీకారం కుదిరిందని తెలిపారు. హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల కనెక్టివిటీ ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు ఆకర్షిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆదాయం పెంచి, పేదలకు పంచే విధానంతో ముందుకు సాగుతామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అద్భుత పాలసీని జాతికి అంకితం చేస్తున్నామని ప్రకటించారు

## ప్రధాని మోదీకి గ్లోబల్‌సమ్మిట్ ఆహ్వానం



**ప్రధాని మోదీని గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించనున్న రేవంత్ రెడ్డి**

**హైదరీబీద్, డిసెంబర్ 01 (నిజాయితి)**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం నాడు ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. గ్లోబల్ సమ్మిట్‌కు ఆయనను ఆహ్వానించనున్నారు. ఆయనతో పాటు పలువురు కేంద్ర మంత్రులను కూడా రేవంత్ రెడ్డి ఆహ్వానిస్తారని తెలుస్తోంది. అమిత్ షా, నిర్మల సీతారామన్, ప్రహ్లాద్ జోషి, హెచ్ డీ కుమారస్వామి, నితిన్ గడ్కరి వంటి కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తారని చెబుతున్నారు.

బుధవారం బేటీలో ప్రధాని మరియు కేంద్ర మంత్రులకు రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ప్రతిపాదనలను రేవంత్ రెడ్డి అందజేసే అవకాశం ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలో జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, ఎక్స్‌ప్రెస్ కారిడార్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన వినతి పత్రాలను అందజేస్తారని తెలుస్తోంది. బుల్లెట్ ట్రైన్ , మెట్రో రైల్ విస్తరణ వంటివి కూడా ఇందులో ఉన్నట్లు సమాచారం.

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తున్న నేపథ్యాన్ని పురస్కరించుకుని తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025 నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ సమ్మిట్ కు తరలిరండి- ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకోండి.. అనే నినాదాన్ని ఖరారు చేసింది ప్రభుత్వం. దీనికి ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, టెక్నాలజీ రంగ నిపుణులు హాజరుకానున్నారు.
డిసెంబర్ 8,9తేదీల్లోహైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనుందీ సమ్మిట్. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజువారీ సమీక్షలు నిర్వహించారు. హైదరాబాద్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్ణయించిన ఆయన ప్రముఖులకు ఆహ్వానాలు పంపించారు. ఇందుకోసం దేశ విదేశాలకు చెందిన దాదాపు 3,000 మంది ప్రముఖులు రానున్నారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్ర, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు, వివిధ కంపెనీల అంతర్జాతీయ స్థాయి సీఈఓలు సదస్సుకు హాజరవుతున్నారు.
తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించడం, పెట్టుబడులకు గమ్యస్థానంగా రూపొందిన ఇక్కడి వాతావరణం, విధానాలు, స్పష్టమైన లక్ష్యాలతో రాష్ట్ర అభివృద్ధి సాధన అంశాలను ఈ వేదికగా చాటి చెప్పాలని ప్రభుత్వం సంకల్పించింది. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. పలు టెక్ కంపెనీల సీఈవోలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులు ఈ సదస్సులో పాల్గొనడానికి ఇప్పటికే సంసిద్ధతను తెలియజేశారు.

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండేవాళ్లను గెలిపిస్తే గ్రామం అభివృద్ధి చెందదు.. -సిఎం రేవంత్ రెడ్డి

**వనపర్తి, నారాయణపేట్ జిల్లాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన**
**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో ప్రసంగం**



**నారాయణపేట/మక్తల్, డిసెంబర్ 1 (నిజాయితి) :**
ఓవైపు కేసీఆర్ చేసిన అప్పులు తీరుస్తూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధిని అడ్డుకునే వాళ్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించవద్దని సూచించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండేవాళ్లను గెలిపిస్తే గ్రామం అభివృద్ధి చెందదని చెప్పారు. మంత్రుల వద్దకు వెళ్లి గ్రామానికి నిధులు అడిగే నేతలను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలని, ప్రభుత్వంతో కలిసి పని చేసే వారిని గెలిపిస్తేనే గ్రామం బాగుపడుతుందని సూచించారు.